# - సుమ -

★



* రచన : శ్రీ బంగారి అనసూయ దేవి. *

(గత సంచిక తరువాయి)

అదేమిటంటే, సుమ అతిత్వరలో పెళ్ళిచేసుకొనడమే! అలా చేస్తేనే ఆస్థి సుమ పేరు మీద వ్రాస్తాడట లేకుంటే ఏ ధర్మ సత్రానికో ధర్మనిధికో సంక్రమించేటట్లు చేస్తానని బెదిరించాడు. పరిస్థితులు అప్పుడు అనుకూలించలేదని సుమ గమ్మున ఊరుకుంది.

సుమ చిన్న నాటకం ఆడింది. సి. యస్. రావును "రిజిష్టర్ మ్యారేజ్" చేసుకున్నానని రూమ్ చూసుకొని కాపరం మొదలెట్టామని దొంగ ఉత్తరం వ్రాసింది తాతగారికి. పాపం రావు బహద్దూర్ మొదట నాల్గుచివాట్లు దులిపి ఎలాగో గడ్డిగా నమ్మాడు. నిజం తెల్సుకోవడానికే వచ్చాడు. రావడంతో తన మనుమరాలిని చూచాడు. రావు ఫొటో చూపించింది. బయట కెళ్ళాడని చెప్పింది. ఎంతో మురిసిపోయాడు. అతని అందాన్ని చూచి ముగ్ధుడయ్యాడు. చిలకా గోరింకలా, అన్యోన్య దంపతులుగా మసలుకుంటున్నారని లక్ష్మమ్మ చెప్పింది. రావుబహద్దూర్ తృప్తిగా నిట్టూర్పు విడిచాడు. సంతృప్తిగా శ్వాస పీల్చుకున్నాడు. ఆస్తినంతా తన మనుమరాలిపేర వ్రాయటానికి నిశ్చయించాడు.

రాత్రి ట్రెయినుకు రావు నాన్నగారు పరమేశ్వరరావు వచ్చారు. పెళ్ళిమాపుకు రావు వెళ్ళలేదు. రావు ఆ [illegible] వచ్చాడు. రాగానే ఒక అమ్మాయితో కాపరం వెలగబెడుతున్నాడని వగైరా అన్ని సంగతులు తెలిసిపోయినవి.

'ఓరేయ్! అప్రాచ్యపు వెధవ! ఎంతపని చేశావురా? మన వంశ ప్రతిష్టను మాయని మచ్చ తెచ్చావట్రా! ప్రపంచములో ఎవ్వరూ దొరకలేదా? మంచి అమ్మాయిని చూచి సల

క్షణంగా పెళ్ళి చేసుకోక! ఎందు కొచ్చిందిగా ఈ డొంక తిరుగుడు గొడవంత? ఇదిగో! ఇప్పుడే చెబుతున్నాను. రేపటినుండి ఇంటి గడప త్రొక్కటానికి వీల్లేదు. నా ఆస్తిలో చిల్లిగవ్వకూడా లభించదు" అని కారాలు మిరియాలు నూరసాగాడు రావు తండ్రి. చిందులు త్రొక్కిన త్రాచుపాములా అటు, ఇటు పచార్లు చేయసాగాడు. ప్రేమ కోసం తంటులో పడిన రావు తండ్రి కోపం చూచి నివ్వెరపోయి మెల్లిగా అట నుండి జారుకున్నాడు. రావు తండ్రికి ఏమి పాలుపోక లక్ష్మమ్మ దగ్గర కెళ్ళి పరిచయమై మాటామంతీ మాట్లాడసాగాడు. లక్ష్మమ్మకు అర్థమైంది సుమ నాటకం. ఇంత వరకు ఇద్దరికి పెళ్ళి కాలేదని సుమ తాతగారి ఆస్తికొరకు ఇందతా చేసిందని తెలుసుకోవడంలో అట్టే టైమ్ పట్టలేదు. లక్ష్మమ్మ రావు తండ్రికి అన్ని విషయాలు వివరంగా చెప్పింది. సంగతంతా విని రావు తండ్రినవ్వు ఆపుకోలేక పోయాడు. సుమ తాతగార్కి కూడా విషయమంతా విదితమైంది. చివరకు రాఘవేంద్రరావు, లక్ష్మమ్మ కల్సి సుమ తాతగారిని, రావు తండ్రిని ఒప్పించి, "మనుసులు కలిసాయి. ప్రేమించుకున్నారు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నారు, ఇష్టమైతే పెళ్ళి చేసేద్దాం!" అని అన్నారు. సుమ, రావులు ఒకరి మొగం ఒకరు చూసుకున్నారు. అందరు ఒప్పుకున్నారు. మొత్తానికి సుమ ఘటికురాలే. రావును పెళ్ళి చేసుకోవడంలో కృతకృత్యురాలైంది. ఇల్లంతా సంతోషలక్ష్మితో వెల్లివిరిసింది.

పెళ్ళి పందిరి. ఎంతో వైభవోపేతంగా అలంకరించబడినది. బంధువులు, స్నేహితులతో పనివారి అరుపులతో, వాయిద్యాల సంగీత గలగలతో, చిరంజీవుల ఏడుపులతో, చిన్నారి కేరింతలతో, పెద్దవారి మురిపాల ముచ్చట్లతో ఎంతో కళకళలాడుతూ యుంది.

సమయం దగ్గర పడుతోంది. బ్రహ్మణోత్తములు వేదమంత్రాలు ఉచ్ఛరిస్తున్నారు. మంగళ వాయిద్యాలు వీనుల విందుగా మేళవిస్తున్నాయి. క్రొత్త క్రొత్త బట్టలతో రంగు రంగుల తీవాసీలతో చక్కగా అలంకరణోత్సవాలతో మురిసిపోతోంది. పెళ్ళికూతురు రంభలా తయారైంది. సంగమేశ్వరరావు మొఖంలో పెళ్ళికొడుకు కళ ఉట్టిపడుతోంది. కల్యాణ మంటపం స్వర్గంలా యుంది. రావు సుమలను తిలకిస్తే పార్వతీ పరమేశ్వరులవలె గోచరిస్తు యున్నారు.

ఓ చక్కని సుముహూర్తాన రావు సుమలు నవదంపతులయ్యారు, నిజ జీవితంలో భాగస్వాములయ్యారు, పెనవేసుకున్న భావాలు ఏకమయ్యాయి. వీడని అనుబంధాలు కలిసాయి. అనురాగాలు ఆలింగనం చేసుకున్నాయి. మెదిలే భావాలు సంతసంతో కదిలాయి. ఉవ్వెత్తున లేచిన మధుర భావాలు జీవన జ్యోతులై, ఆలసాన తారకలవోలె మిణుకు మిణుకు మంటూ తెల్లని వెలుగుసోయగాలను ఒక్కుమ్మడిగా విరజిమ్మాయి. ఆనంద సాగరంలో, అలల సవ్వడిలో సంతోషాతిరేఖలు ఉవ్వెత్తున లేచాయి.

"నువ్వు! నేను! ఏకమయ్యాము" అని దూరాన మధుర కంఠం.

(సంపూర్ణం)

